కథ

## 'మీకు క్యాన్సర్' అన్నాడు డాక్టర్.

నా కాళ్లకింద భూమేమీ కదిలిపోలేదు. నా కళ్లేమీ గిర్రున తిరగలేదు. తూలి పడబోతున్నట్టు అసలే అనిపించలేదు. అయినవాళ్లని తలుచుకుని అశ్రువులేమీ కిందికి జారలేదు. అర్థంతరంగా, అదీ నిండా ముప్పై నిండకుండా పలకరిస్తున్న మృత్యువును తలచుకుని నాకేమీ భయమనిపించలేదు... వణుకు అసలే పుట్టుకురాలేదు.

మరేం జరిగిందయ్యా అంటే-

సహజాతి సహజంగా నాకు తెలిసిన నిజాన్ని మరొకరి నోటంట విన్న భావన కలిగింది.

'హేయ్ ఇది విన్నావా... సూర్యుడు తూర్పున ఉదయించును...' అని పొద్దున్నే మనం వాకింగ్‌కు వెళుతుంటే ఎవరయినా ఎదురుపడి చెబితే ఎలాగుంటుంది? నాకలాగనిపించింది. ఎన్నాళ్లో వేచిన ఉదయం ఆనాడు ఎదురయినట్టయింది. క్యాన్సర్ అవునో కాదోనన్న సందేహాన్ని పారద్రోలడం కాదు అతను చేసింది. అవునన్న నా లోలోపలి అభిప్రాయానికి వాస్తవాల ఋజువులతో వత్తాసు పలికాడా డాక్టరు ఆ ముక్క నాకు చెప్పినప్పుడు. ఇంకా చెప్పాలంటే సూర్యుడు ప్రతిదినమ్మూ తూర్పునే ఉదయించునన్న సత్యాన్ని స్కానింగులు చేసీ, బయాప్సీలు తీసీ... వారం తర్వాత మనమేమనుకుంటామేమోనని భయంభయంగా చూస్తూ ఎవరైనా చెబుతున్నారనుకోండి. పక్కుమని నవ్వురాక ఏం చేస్తుంది?

అందుకే నాకు నవ్వొచ్చింది.

'అయ్ డోంట్నో వాట్టూ టెల్యూ. అండ్ అయ్ డోంట్నో వాట్టూడూ. అయినా మీకు చెప్పే తీరాలి...' అంటున్నాడా అంకాలజిస్ట్.

అబ్బా... సినిమాలు చూసి ఎంత పాడయిపోతారో జనాలు. సమస్య ఉన్నదేమో నాకు. ఉన్నదున్నట్టు చెప్పాల్సింది ఆయన. దానికింత తాత్సారం, శషభిషలూ ఎందుకు?

'సీ...దిసీజ్ ఫస్టైమ్ ఇన్దవాల్డ్'.

హో... వాటే ఫన్... బాగా పేరుందని ఈయన దగ్గరకొచ్చేను చూడూ... నాకు బుద్ధుండాలి. పది మందిలో ఒకరికున్న క్యాన్సర్‌ను పట్టుకుని ప్రపంచంలో మొదటిసారి అంటాడేమిటో.

'క్యాన్సరంటే తెలియని చిన్నపిల్లలు కూడా ఉండరు. ఈయనేమిటి ఇలాగంటాడని ఆశ్చర్యపోకండి...'

# వర్డ్ క్యాన్సర్

అరుణ పప్పు

అబ్బా... మనవాడికి మైండ్ రీడింగ్ కూడా తెలిసినట్టుంది. సరే కానీ. ఎంత మందిని చూళ్లేదూ?

'యువర్ కేసీజ్ డిఫరెంట్...'

కార్పొరేట్ హాస్పత్రుల్లో ఈ మాట ప్రతి డాక్టరూ జలుబని వెళ్లిన వాడిక్కూడా చెప్తారని నాకు తెలీదా?

'వాట్వీ డిటెక్టెడ్ ఈజ్... మీ ఒంటినిండా పదాల పుట్టలు... రక్తం నిండా అవే. మెదడులోనైతే గుట్టల్గుట్టలు... వర్డ్ క్లాట్స్... ప్రిసైస్లీ.. మీకు వర్డ్ క్యాన్సర్...'

'అంటే మాలిగ్నంట్ సెమాంటిక్ లింఫోమానా డాక్టర్...' అంటూండగానే చిన్న నవ్వు మొలిచింది నా పెదాల పైన. ఎందుకో అది శుక్ల విదియ నెల బాలుడిలా వెలిసిన కొద్దిసేపటికి వెలిసిపోయినట్టు తెలుస్తూనే ఉంది.

డాక్టర్ నా వైపు భయంగా చూశాడు 'యస్, క్లినికల్ లక్షణాలివే...' అంటూ గొణుక్కుంటూ వెళ్లిపోయాడు.

పసిపాపగా ఉన్నప్పట్నుంచీ పాలకి బదులు పదాల్ని తాగినందుకిదా పర్యవసానం?

ఊహ తెలియక ముందు నుంచీ అక్షరాల్ని నమిలి మింగిన ఫలితం ఈ రూపం ధరించిందా?

వాక్యాల్ని పట్టుకుని ఉయ్యాలలూగిన వైనమిలా వికటించిందా?

కూర్యాత్కటాక్షం కల్యాణీ కదంబవనవాసినీ... సరస్వతీ నమస్తుభ్యమని ఉపాసించినందుకీరీతి వశమైందా అమ్మ? వచ్చెయ్యమని పిలుస్తోందా...

అక్షరాల్ని ఒక్కటొక్కటిగా చెక్కుకుంటూ, వాక్యాల్ని పేర్చుకుంటూ బతుకును నెట్టుకొస్తున్నదాన్ని... తిన్నా తాగినా ఏడ్చినా నవ్వినా సుమించినా రమించినా అన్నీ వర్ణమాల వర్గ సంచయంతో కాదూ!



ఇంతకీ వర్డ్ క్యాన్సర్... పదం బావుంది.

ఇదొచ్చినందుకు బాధపడుతున్నానా... విచారిస్తున్నానా... అనుమానం ధృవపడినందుకు ఆనందిస్తున్నానా?

'ఇంతగా విస్తరించిన క్యాన్సర్ సెల్స్‌ను తొలగించడం ఎలాగన్నదే మన ఘుందున్న ప్రశ్న. మీరు మరికొంచెం ముందొచ్చుంటే బావుండేది. ఇట్స్ టూ లేట్... ఇప్పుడు వీటిని నిర్మూలిస్తే మీ ప్రాణానికే ప్రమాదం...'


ఇంతసేపటికీ డాక్టరుకు అసలు విషయం అర్థమయింది. కాని విషయమూ ఒకటుంది.

ఎవడిక్కావాలండీ బోడి ప్రాణం...?

కుమ్మరి పురుగు దొర్లించుకున్నా తొలుచుకున్నా తిన్నా మట్టే. నేనో కుమ్మరి పురుగును. నిర్మించినా, విసర్జించినా, అన్నీ వాక్యాలే. పదాల దృక్చిత్ర మాలికలే. అవే లేకపోయాక నేనుండీ ఏం లాభం? అప్పుడు నేను శవప్రాయాన్ని కానూ!!

అంతకన్న పదాల క్యాన్సర్‌తో శవం కావడమే నయం.

నాకు తెలుసు. అయస్కాంతానికి ఇనుప రజను



అంటుకున్నట్టు నా వేళ్ల చివరన పదాలు అతుక్కుంటున్నాయి. నేనే గనక కీబోర్డు మీద వేళ్లు టకటకలాడించి వాటిని విదుల్చుకోకుంటే అవి వెనక్కి తిరిగెళ్లిపోయి నా హృదయం చుట్టూ వర్డ్ క్లాట్స్‌ను ఏర్పరుస్తాయి. ఇది రక్తం క్లాట్స్ కన్నా ప్రమాదకరం. ఎందుకంటారా, రక్తం గడ్డలు కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పడితే వెంటనే చంపిస్తాయి. వర్డ్ క్లాట్స్ అలా కాదే... అవి ఎక్కడివక్కడే ఉండిపోతాయి. చెప్పదల్చుకున్నవీ, చెప్పలేకపోయినవీ భావాలతో నిండిన పదాలు. అప్పుడప్పుడూ గుండెనొప్పిని తెప్పిస్తుంటాయి..."

ఎంత బాగా చెప్పిందో మీనాక్షి రెడ్డి తన పుస్తకంలో.

మరి నేను? ఇప్పటిదాకా చెప్పలేకపోయిన వాక్యాలే నన్నీ వర్డ్ క్యాన్సర్ బారిన పడేశాయా...

ఎప్పటికప్పుడు పొందిగ్గా పేరుస్తూనే ఉన్నానే...! మరింతగా ఒళ్లంతా ఎలా చెల్లాచెదురయ్యాయబ్బా...

చిన్నప్పుడు టీచర్లు చెప్పిన డిక్టేషన్ రాశాను... అమ్మా నాన్న చెప్పినవన్నీ రాశాను... పెళ్లయ్యాక గ్రామరది కాదు ఇదంటే నేర్చుకున్నాను... ఒళ్లోని చంటిపిల్లాడితో కలిసి కొత్త అనుభూతుల్ని ఉంగాలు కొట్టాను... పాత్రికేయంలో పాఠకులకు నచ్చేలా రాశాను... ఎడిటరేదంటే అది రాశాను... ఎవరేది చెప్పమంటే అది చెప్పాను కదా. ఎప్పటికప్పుడు వర్డ్స్ క్లాటయిపోకుండా విదుల్చుకున్నానే. మరిదేం క్యాన్సరో. ఇంకేదో ఉండిపోయిందా...

ఆ... తెలిసింది.

అస్తమానం సిగరెట్లు కాల్చేవారికి ఊపిరితిత్తుల క్యాన్సరూ, కడుపు నిండా తాగేవాళ్లకి లివర్ క్యాన్సరూ వచ్చినట్టన్నమాట. అస్తమానం అదే పనిగా పదాల్ని పీలుస్తూ గడిపినందుకిది.

కీమోథెరపీ చేస్తే, రేడియేషనిస్తే రా...లి, పో...వడానికివేమైనా నెత్తి మీద వెంట్రుకలా...

దానికి భాషుంది తల్లీ... వాటిని శిరోజాలు అనాలి. శరీరమ్మీదైతే

చిన్నప్పుడు టీచర్లు చెప్పిన డిక్టేషన్ రాశాను... అమ్మానాన్న చెప్పినవన్నీ రాశాను... పాత్రికేయంలో పాఠకులకు నచ్చేలా రాశాను... ఎడిటరేదంటే అది రాశాను... ఎవరేది చెప్పమంటే అది చెప్పాను కదా. ఎప్పటి కప్పుడు వర్డ్స్ క్లాటయిపోకుండా విదుల్చుకున్నానే. మరిదేం క్యాన్సరో. ఇంకేదో ఉండిపోయిందా...

రోమాలు... మీసం గడ్డం కలిసి శ్మశ్రువు... శష్పమంటే... ఛా... ఒద్దు...

బాతోబాతోంమే ఎన్ని పాఠాలు వినలేదు...

అయినా ఒంట్లోంచి పదాలలా రాలిపోతే ఎలా?

మళ్లీ కొత్తవి వస్తాయా?

అభినందనలూ నిరసనలూ సరసాలూ విరసాలూ పదాల పునాదుల మీద కాదూ నిలబడింది? వాక్యాల ప్రహరీగోడలే లేకపోతే మనమంతా ఓ కుటుంబంలా ఉండగలుగుదుమా?

డాక్టర్ దగ్గర సెలవు పుచ్చుకుని ఇంటికెళదామని బైటకొచ్చి నిలుచున్నా.

అకస్మాత్తుగా ఆకాశం మబ్బు పట్టింది. తల పైకెత్తి చూస్తే మేఘాలు. ఏనుగుల్లా ఎలా కమ్ముకొస్తున్నాయో. ఈ ఉపమను ముందు వాడిందెవరో, వాల్మీకా వ్యాసుడా భాసుడా! తలపైకెత్తి చూస్తుంటే టప్‌మని వానచుక్క సూటిగా ముక్కుమీద గుద్దే సూటిమాటలా వచ్చి తాకింది.

మేఘ మథనం చేస్తున్నామన్న వార్త నిన్నే చదివాను.

ఇంతకీ పద మథనం చేస్తే ఏమొస్తుంది? మురిపించడానికి ముందేదో ఒక స్పెల్‌బీ అవార్డూ, కొన్ని ఆహా ఓహోలూ... ఆక్స్‌ఫర్డ్ సర్టిఫికెట్టూ రావొచ్చు... తర్వాత మింగాల్సిన గరళం వర్డ్ క్యాన్సర్.

పట్టుకుందంటే మరొదల్దు.

భాషా సాగర మథనంలో అదీ అంత్యాన మనల్ని వరించే మహాలక్ష్మి. ఈ మాట ఉద్యోగంలో చేరిన కొత్తలోనే మా పతంజలి దగ్గర కూచోబెట్టుకుని మరీ చెప్పేవాడు. "తల్లీ, అక్షరాలు రక్కుతాయి. రక్తాలొచ్చేట్టు కొరుకుతాయి. మీదపడి కరిచేస్తాయి. దోమల్నీ పాముల్నీ మీదకు దూకేసిన పులినీ విదిలించుకోలేనట్లు తప్పించుకోలేనట్లు, అక్షరాల నుంచి కూడా తప్పించుకోలేరెవ్వరూ. అటువంటి అక్షరాలు వార్తాపత్రికల్లో కూడా పుడుతుంటాయి".

నేనలాంటి అక్షరాల శిల్పిని కావాలని ఎంతో అనుకున్నాడాయన. ఏం లాభం? వర్డ్ క్యాన్సరంటూ వచ్చి పడి, నన్ను అర్థంతరంగా లాక్కుపోతుందని ఆయనకు తెలీదుగా!

ఇంతకీ దొవా రాయిస్తున్నదేమంటే నేను ప్రపంచంలో ప్రప్రథమ వర్డ్ క్యాన్సర్ రోగిని.

ఈ వార్తకు మా పాత్రికేయ ప్రపంచమెలా స్పందిస్తుందో! ఎవరే మాటలతో హెడ్డింగులు పెడతారో, ఎవరెంత అందంగా వార్త రాస్తారో వ్యాఖ్యానిస్తారో చూడాలి. రేపొద్దునే పేపర్లు. నాకో గంటన్నర భోజనం. అప్పటివరకూ ఆగుతారా టీవీలవాళ్లు? స్క్రోలింగులేమని ఇస్తారో! నాకుతూహలం పెరుగుతోంది. వర్డ్ క్యాన్సర్ సోకిన తొలి వ్యక్తిగా నేను చరిత్రలో నిలిచిపోతాను!! ఎంత బావుందో ఈ ఆలోచన. ఆలోచన అనాలా... ఊహ అనాలా... వద్దు... ఇలా చేసే ఇంతవరకూ తెచ్చుకున్నాను...

అవునూ ఇప్పుడిలా అర్థంతరంగా చచ్చిపోతే ఇప్పుడిప్పుడే స్పెల్లింగులు నేర్చుకుంటున్న కొడుకేమవుతాడు? హెలికాప్టర్ స్పెలింగేటమ్మా... అనడుగూనే చేతుల్ని రెక్కల్లా విప్పి ఝామ్మని దూసుకెళ్లే నా చిన్ని కృష్ణుడేమవుతాడు?

వాన పెద్దదయింది. చూస్తుండగానే మహోధృత రూపం దాల్చింది. నటరాజ నర్తనంలా ఉరుములు, మెరుపులు.

జటాటవీగఝల ప్రవాహ పావితస్థలే గలేవలంబ్యలంబితాం

భుజంగతుంగమాలికాం

జటాకటాహ సంభ్రమభ్రమన్ని లింపనిర్ఝరీ విలోల వీచివల్లరీ విరాజ మానమూర్ధని

ధగద్ధగద్ధగజ్జ్వ లల్లాటపట్టపావకే కిశోర చంద్ర శేఖరేరతిః ప్రతిక్షణం మమ...

నిల్చున్న దగ్గర తుంపర పడి తడి అనుకున్నది కాస్తా పిల్ల కాలువ లాగా మారింది.

జల్లుమంటు సిరివానా చందనాలు కురిసేనా... సిరివెన్నెలా, నాకీ మొహమెలా పోతుందో చెప్పవూ....

ఎగువనెవరో కాగితప్పడవలు చేసి వదుల్తున్నారు.

వాగమశాసనుడు, శబ్దశాసనుడు నన్నయ నుంచీనా, పెద్దన వరకూ నా శ్రీశ్రీ శ్రీపాదా మల్లాదీ కూడానా... వాళ్లకన్నా ఎగువనెవరో ఇంకెవరో ఉన్నారే...

అన్నీ దిగువకు ప్రవహిస్తున్నాయి. టీవీలూ నేరాలు ఘోరాలూ తప్ప మరేం పట్టని లోకంలోకి వీళ్లిలా ప్రవహించడం ఆకాశంబున నుండి అందుండి ఉందుండి వివేకభ్రష్టసంపాతమా... ఏమో అవునేమో... కాదేమో.

బాగా తడిసయినా ఇంటికి తొరగా వెళ్లాలని పూర్తిగా వర్షంలోకి వచ్చేశాను. నడుస్తున్నాను...

అరె... ఎన్ని వాక్యాలు వర్షిస్తున్నాయో... ఎన్ని పదాలు పడుతున్నాయో...

హ్యాండ్‌బ్యాగేదీ... కొన్నిటిని పట్టుకుంటా... ఈ ఏడాది జీవితంలో మళ్లీ దాహం తీర్చుకోవడానికి కావాల్సినన్ని ఎప్పుడు దొరుకుతాయో. బోల్డన్నిటిని అందుకోవాలి... సందర్భాను సారం వాడుకోవాలంటే పద ప్రజ్ఞ అవసరం. నా దాహం వెర్రిగా పెరిగిపోతోంది.

ఇప్పటికిప్పుడు కొన్నిటిని నింపుకొందామని బుర్రను ఓపెన్చేశా... చేతుల్లో దేవులాడి మరికొన్నిటిని పోగుచేశా... అబ్బే ఎక్కడ... అన్నీ రావటం లేదే.



**దయచేసి నన్ను పదాల పల్లకీ కట్టి చివరిసారి ఊరేగించండి. అక్షరాల నిప్పులో చివరకంటా చితిని చితికిపోనివ్వండి. ఇంత బూడిదను భరిణలో పెట్టి పవిత్ర పుస్తక ప్రవాహంలో కలిపేయండి. పేపర్లో స్మృత్యంజలి వేయిస్తే శార్ధ్లిమైజ్, ఆబిట్యురీ, నిర్యాణం, కన్నుమూత, అనురాగదేవత అస్తమయం, దశదినకర్మ, వైకుంఠ సమారాధన, పెద్దకర్మ... వంటి రొడ్డకొట్టుడుకు బదులు, మరో అందమైన పదబంధమేదైనా దొరుకుతుందేమో వెతకండి...**

అదిగో వచ్చేశాడు అమరసింహుడు ప్రౌఢతరభాషాతిప్రగల్భుండు... పెద్ద గోనెసంచులు తీసుకొచ్చాడు... అన్నీ ఏరేసుకుంటున్నాడు... అయ్యో నాకేమీ మిగలవుగాబోలు... ఇప్పటికే అతన్దగ్గర చాలా ఉన్నాయి. అమరకోశం రాశాడుగా మరి. మళ్లీ నాతో పోటీకొస్తాడేమిటో... ఇదేమిటి.. ఇటు తిరిగి చూస్తే ఈ తెల్లవాడెవడు? రోజెట్స్!! థెసారస్ రాసిందియనే కదా? వీళ్లిద్దరికీ ఎంత పదసంపద ఉందో...

వీళ్లనేం చెయ్యాలి...? ఇక్కణ్నుంచి పొమ్మని తరిమేస్తే...!

ఈ వాన మరో కోనలో కురవదా...? వీళ్లు అక్కడికెళ్లి పట్టుకోరనే గ్యారెంటీ ఏమిటి...!

పోనీ నేనే బజార్లో కొనుక్కుని ఇన్‌స్టెంట్‌గా ఒంటపట్టించుకోనా? పదాల మాలికలు అంగట్లో అమ్మేవీ, కొనేవీనా? కష్టపడకుండా సంచి తీసుకెళ్లి తెచ్చుకోవడానికి!! అమ్మేవారెవరు... పోతన అమ్మనన్నాడు కదా!

ఆడపిల్లగా కన్నా అడవిలో మానయి పుడితే మేలని రోజుకి వందసార్లంటుంది అమ్మమ్మ.

నాకు మాత్రం అడవికెళ్లినా ఈ బాధ పోయేట్టు లేదు. సన్నజాజి తీగలుగా కొన్ని, మోదుగుపూలల్లా కొన్ని... వాక్యాలు. కొమ్మకొమ్మకో సన్నాయి... అన్నీ ఆలపించాలి, వాక్యమో సంగీత స్వరంలా అనిపించాలి... దాన్లో రాగాల తూగుండాలి... ఉండొద్దు మరీ...?

చదువుతున్నప్పుడది ఉయ్యాలలలూపాలి... తమిబూదీగెల తరహాలో ఆకాశానికంటిన కాళ్లతో కన్నెపిల్లలుయ్యాలూగుతున్నంత... ధూర్జటి వర్ణనంత తూగుండాలి. ఆయనకి వర్డ్ క్యాన్సర్ రాలేదా...? వారవనితా జనితా మనతాపహార సంతత మధురోధర సుధారస ధారలలా లైను కట్టేయికానీ క్యాన్సరొచ్చిందా...! వాక్యమంటే రారా చిన్నన్నా... రారోరి చిన్నవాడ... అని ముద్దుగా అన్నమయ్య వేణుగోపాలుణ్ని పిలిచినంత మార్దవంగా ఉండాలి. నీలం రంగు నిప్పు పువ్వయి ప్రకాశించాలి. సర్వమూ తానె అయినవాడిలా లాలించి పాలించాలి. వానవిల్లు మీద నడిచి మేఘాల్లో తేలినట్టుండాలి. కాలిగ్రఫీ చిత్రాల్లా కళ్లకు కట్టాలి. కందర్ప హేతువై ఘనధూమ కేతువై చుట్టుముట్టాలి. యూనిఫామేసుకుని అప్పుడే స్కూలుకొచ్చిన పిల్లలు ప్రభావ వేళ ప్రార్థన సమయంలో లైను కట్టి నిల్చున్నట్టుండాలి. అప్పుడప్పుడూ భావాలు ఎర్రకోట ముందు సైనికుల్లా కవాతు చెయ్యాలి. మాటలు ఈటెలూ కత్తులూ. అవే చురుక్కుమనిపించే చమక్కులు. మనసుల్ని ముడివేసే మంత్రాలు.

పదాల్ని నేర్చుకోమంటా ఎన్ని పుస్తకాలో. వర్డ్ పవర్ మేడీజీ...

వెన్ ఇటీజ్...? నెవర్. అట్లీస్ట్ నెవర్ ఇన్మై లైఫ్‌టైం!

ఎప్పటికప్పుడు ఎన్ని డిక్షనరీ డాట్కామ్‌లు తీసి చూసుకున్నా తీరని మోహం. ఆలోచనల్లో పడి చూసుకోనేలేదు... ఏరీ అమరసింహుడూ, రోజెట్సూ, నన్నయ తిక్కనాది కవులూ? అందరూ గోతాలెత్తుకొని మాయమైపోయారు. వాన వెలిసిపోయింది.

దోసెడు కూడా రాలేదు నాకు పదాలు.

చుట్టూ పరచుకున్న నిశ్శబ్దం. అదంటే నాకు భయం.

నిశ్శబ్దం,. మౌనం బావుంటాయని చాలాసార్లే చదివాను. లేనివాటిని దొరకనివాటిని రొమాంటిసైజ్ చెయ్యడం రచయితలకు పెద్ద జబ్బు. నా క్యాన్సర్‌ను మించిన పెద్ద జబ్బు. నాకు మాత్రం మాటలే బావుంటాయి. వాటితో అల్లే బంధాల అల్లిక బావుంటుంది. పదాలే లేకుంటే ప్రపంచంలో ఇన్ని భావాలు బట్వాడా అయ్యేనా? మౌనాన్నీ చూపునూ ఒక దేహచలనాన్నీ అన్నిటినీ పదాల్లోకి తర్జుమా చేసే భాషంటే నాకు భలే ఇష్టం.

అంత మంచి మాటలతో ఆటలెన్ని ఆడుకోవచ్చునీ. అది కూడా అందరికీ తెలిసేదిస్తేగా. కొంచెం తెలిసే నా పనిలాగయింది. నేన్వెళ్ళిపోతున్నాను... ఒక్క కొత్త మాటనూ సృజించకుండా. గొడ్రాలిగా.

సరే, పోతున్నానన్నది ఖాయం.

తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితా... అవున్నేనాయన దగ్గరకే. ఇప్పుడొక మనవి. ఇది నా విన్నపం.

మై డియర్ ఫ్రెండ్స్ అండ్ ఎనిమీస్

రిలెటివ్స్ అండ్ ఇర్రెలెటివ్స్,

దయచేసి నన్ను పదాల పల్లకీ కట్టి చివరిసారి ఊరేగించండి. అక్షరాల నిప్పులో చివరకంటా చితిని చితికిపోనివ్వండి. ఇంత బూడిదను భరిణలో పెట్టి పవిత్ర పుస్తక ప్రవాహంలో కలిపేయండి. పేపర్లో స్మృత్యంజలి వేయిస్తే శార్ధ్లిమైజ్, ఆబిట్యురీ, నిర్యాణం, కన్నుమూత, అనురాగదేవత అస్తమయం, దశదినకర్మ, వైకుంఠ సమారాధన, పెద్దకర్మ... వంటి రొడ్డకొట్టుడుకు బదులు, మరో అందమైన పదబంధమేదైనా దొరుకుతుందేమో వెతకండి... ఆ నాలుగు వాక్యాల్లోనూ అచ్చుతప్పులూ అడ్డదిడ్డమైన విరామ చిహ్నాలూ లేకుండా ఒక్కసారి జాగ్రత్తగా ప్రూఫులు పట్టిపట్టి చూడండి. నేను తీసుకుంటున్న సుదీర్ఘ విరామానికి వాటితో శరాఘాతాలేవీ తగలకుండా జాగ్రత్త పడండి. నా తులసికోటమీద అఖండమైన అక్షరదీపాన్ని వెలిగించండి. వారసత్వంగా ఒక్క కొత్త పదాన్నీ, ఒక్క సృజనాత్మక వాక్యాన్నీ వదిలెళ్లని నన్ను మన్నించండి. ఒక్క వాక్యాన్నీ నిర్మించని నా అశక్తతను అర్థం చేసుకోండి. ఎందుకలా జరిగిందో విచారించండి. నలుగురు కూచొని చదివే వేళల నా పేరొకపరి తలవండి.